ఆహ్లాదం.. ఆనందం



నగరంలోని పార్కులు కిటకిటలాడాయి. ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో నగర వాసులు కుటుంబ సభ్యులతో కలిసి పార్కులకు తరలివచ్చి సందడి చేశారు. రాజీవ్ గాంధీ పార్క్, రాఘవయ్య పార్క్, బీఆర్ అంబేడ్కర్ పార్కుల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చిన్నారులు, పెద్దలు ఆహ్లాదంగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











క్లుప్తంగా

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

ముస్లిం మైనార్టీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు సభ్యులంతా కృషి చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. సింగ్‌నగర్‌లో ఏఎంసీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ ప్రజల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం సోదరులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం లభిస్తోందని పేర్కొన్నారు. అనంతరం 59వ డివిజన్ ఏఎంసీ అధ్యక్షుడిగా షేక్ సలీంభాష, పశ్చిమ నియోజకవర్గంలోని 55వ డివిజన్ అధ్యక్షుడిగా ఎండీ షఫీఅహ్మద్‌ను ఎంపికచేసి, వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ నాయకులు హఫీజ్, షేక్ సాజిద్‌అలీ, సయ్యద్ మౌలాలి, షేక్ మస్తాన్, మునీర్‌అహ్మద్ ,అబ్దుల్‌రహీం, మహమ్మద్‌రఫీ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధుర గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలి



విజయవాడ కల్చరల్: మధుర గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, శ్రీ కళా భారతి, స్వరఝురి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద అలనాటి మధుర గాన లహరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్వరఝురి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షురాలు తాళ్ళూరి శ్రీదేవి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులు అని అభివర్ణించారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ గాయనీ గాయకులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. అలనాటి మధుర చిత్రగీతాల కార్యక్రమంలో భాగంగా అంజిబాబు, కోటేశ్వర రావు, ఆలపాటి అశోక్‌కుమార్, బాలాజీ, పూర్ణచంద్రరావు, అంజుస్వామి పలు క్లాసికల్ గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరికి ఉండాలి



పాయకాపురం(విజయవాడరూరల్): ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరికీ ఉండాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ కండ్రిక షకీలా ప్రార్థన మందిరంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్లాది విష్ణు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని, క్రీస్తు పుట్టుక సర్వమానవాళి కోసమేనని పేర్కొన్నారు. రెవరెండ్ ఫాస్టర్ ఎస్.దాస్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోటశ్రీనివాస్, కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ, బీహెచ్ జానారెడ్డి, పార్టీ నాయకుడు యరగొర్ల శ్రీరాములు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల శీతాకాలంలో వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చల్లగాలికి దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరూ సీజనల్ పండ్లను ఆహార పదార్థాలుగా తీసుకోవాలని అన్నారు. హోమియో వైద్యనిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, ఆయుర్వేద వైద్యనిపుణురాలు డాక్టర్ పూజ మాట్లాడుతూ ఆయుర్వేదం, హోమియోపతి చికిత్స ద్వారా అన్ని రకాల వ్యాధులను ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా నయం చేయవచ్చని తెలిపారు. అనంతరం సుమారు 350 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

19 నుంచి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో నూతన వైనతేయ మండపం, ధ్వజస్తంభ త్రయాహ్నిక ప్రతిష్ఠా మహోత్సవాలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. స్థానిక మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తలు, ప్రత్యేక ఆహ్వానితులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ 19 నుంచి 22వ తేదీ వరకు వేదపండితుల మంత్రోచ్చారణలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతాయన్నారు. 22న అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

నమ్మకమైన వైద్య సేవలకు బెజవాడ హాస్పిటల్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలో నాలుగు దశాబ్దాలుగా డయాగ్నోస్టిక్స్ సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందిన బెజవాడ డయాగ్నోస్టిక్స్‌లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు డాక్టర్ చలసాని రాజేంద్రప్రసాద్ తెలిపారు. గవర్నర్‌పేట కోదండరామిరెడ్డి వీధిలో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బెజవాడ హాస్పిటల్స్ అండ్ డయాగ్నోస్టిక్స్‌ను ఆదివారం నిర్వాహకులు డాక్టర్ చలసాని రాజేంద్రప్రసాద్, డాక్టర్ చలసాని పరిమళలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో లింబ్ రీ కన్‌స్ట్రక్షన్, ఆర్థోస్కోపీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ఫెలోషిప్ చేసిన డాక్టర్ ప్రశాంత్ చలసాని సేవలు అందిస్తారన్నారు. ఆర్థోస్కోపీతో భుజాలు, మోకీలుకు కీ హోల్ శస్త్రచికిత్సలు, లిగ్మెంట్ గాయాలకు సంక్లిష్టమైన ఫ్రాక్చర్స్‌కు శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నగరానికి చెందిన ఫిజీషియన్ డాక్టర్ రూప కొల్లి, రేడియాలజిస్ట్ డాక్టర్ కావ్య మిక్కినేని తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న చలసాని పరిమళ

సంప్రదాయాలను ప్రతిబింబించిన చేనేత, హస్తకళలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చేనేత, హస్తకళల మేళవింపుతో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించాయి. అద్భుతమైన హస్తకళలు సందర్శకులను అబ్బురపరిచాయి. మినిస్టరీ ఆఫ్ టూరిజం, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్న్‌మెంట్ ఆఫ్ ఇండియా, సంగీత నాటక అకాడమీ, ఆంధ్రప్రదేశ్ టూరిజం ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 'కృష్ణవేణి సంగీత నీరాజనం' కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన హరిత బరంపార్క్‌లోని పున్నమి ఘాట్‌లో వివిధ స్టాల్స్‌తో కూడిన ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. విజయవాడకు చెందిన వీవర్స్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసిన చేనేత మగ్గంపై కళాకారుడు నేస్తున్న దృశ్యం సందర్శకులను ఆకట్టుకుంది. అదే విధంగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి ధర్మవరం సిల్క్ శారీస్, గుంటూరు జిల్లా మంగళగిరి కాటన్ శారీస్, కాకినాడ జిల్లా ఉప్పాడ శారీస్, గద్వాల్ జిల్లా నుంచి గద్వాల్ కాటన్ అండ్ సిల్క్ శారీస్, భువనగిరి జిల్లా యాదాద్రి నుంచి పోచంపల్లి ఇకాట్ కాటన్ అండ్ సిల్క్ శారీస్, హైదరాబాద్ బ్యాంగిల్స్, శ్రీకాళహస్తి నుంచి కలంకారీ పెయింటింగ్ శారీస్, టాప్స్, వాల్ హేంగింగ్స్ స్టాల్స్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి బొమ్మలు, అనంతపూర్ జిల్లా నిమ్మలకుంట నుంచి లెదర్ పప్పెట్స్, నిజామాబాద్ నుంచి బంజారా ఎంబ్రాయిడరీ హ్యాండ్ బ్యాగ్స్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో వచ్చిన పర్యాటకులు ఈ ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు.



చేనేత మగ్గంపై నేస్తున్న కళాకారుడు

ఆధ్యాత్మిక సేవలకు ప్రతీకలు.. ఆర్యవైశ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు ఆర్యవైశ్యులు ప్రతీకలుగా నిలుస్తున్నారని ప్రపంచ వాసవీ మహాపీఠాధీశ్వరులు శ్రీధర్ స్వామీజీ పేర్కొన్నారు. పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, వాసవీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గొల్లపూడిలోని పద్మావతి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య వైభవం పేరుతో ఆదివారం నిర్వహించిన కార్తిక వనసమారాధన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రవచిస్తూ భక్తులను అనుగ్రహించడం కోసం అమ్మవారు అనేక రూపాల్లో అవతరిస్తుందని, వాటిల్లో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అవతారం ఒకటని చెప్పారు.తొలుత శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి కల్యాణం, అనంతరం సామూహిక శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రతాలను ఆర్యవైశ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజాధికాల తరువాత స్వామివారి అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు వీవీకే నరసింహారావు, పారేపల్లి రాకేష్, కొణిజేటి రమేష్, దర్శి వాసు, నూకల నాగేశ్వరరావు, జాలాది వెంకటేశ్వరరావు, బొగ్గవరపు సత్యనారాయణ, తుమ్మలపెంట శ్రీనివాసులు, శేగు వెంకటేశ్వర్లు, చుండూరు ఉమామహేశ్వరరావు, కేవీఎల్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



వనసమారాధనలో ప్రవచిస్తున్న శ్రీధర్ స్వామిజీ

సహనాన్ని పరీక్షిస్తున్న రైల్వేగేటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా వేలాది మంది రాకపోకలు సాగించే మధురానగర్ రైల్వేగేటు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఇక్కడ తరచూ రైల్వేగేటు వద్ద గూడ్స్ రైలు నిలిపివేస్తుండటంతో వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెక్టుగా రైల్వేగేటు వద్ద గూడ్స్ రైలు నిలిపివేయడంతో రైలు ఎప్పుడు వెళుతుందో గేటు ఎప్పుడు తీస్తారో తెలియక అయోమయానికి గురవుతున్నారు. రైల్వే అధికారుల తీరు వల్ల తమ విలువైన సమయంతో పాటు ఇంధనం వృధా అవుతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వేగేటు వద్ద గూడ్స్ రైళ్ళను నిలపడం మానుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.



ప్రతిభావంతుడైన సాహితీవేత్త కట్టమంచి రామలింగారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిభావంతుడైన సాహితీవేత్త, విద్యావేత్త, పండితుడు, వక్త, రచయిత, హేతువాది కట్టమంచి రామలింగారెడ్డి అని మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు అన్నారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా సాహితీవేత్త కట్టమంచి రామలింగారెడ్డి జయంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన క్షత్రియ సేవా సంఘం ఉపాధ్యక్షుడు డి.రామలింగరాజుతో కలిసి కట్టమంచి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. నేడు భౌతికంగా కట్టమంచి లేకున్నప్పటికీ ఆయన చేసిన సేవలు, రాసిన పుస్తకాలు ప్రతీ ఒక్కరి హృదయాల్లో నిలిచే ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు కె.సుబ్బరాజు, సాంస్కృతిక సంఘం కార్యదర్శి కెఎస్.ప్రసాదరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వి.సుబ్బరాజు, కార్యవర్గ సభ్యులు పి.రాంబాబు, ఆర్.పిచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



కట్టమంచి రామలింగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

విరాళాల వివరాలు తెలపండి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ప్యారిస్ పరిశుద్ధ సీయోన్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రార్థనా సమయంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. చర్చి పునర్నిర్మాణం కోసం దాతల నుంచి సేకరించిన విరాళాలపై క్షుణ్ణంగా వివరాలు తెలియజేయాలని సంఘ సభ్యుడు దయాల రాజేశ్వరరావును సంఘస్తులు నిలదీశారు. దీంతో చర్చిలో తీవ్ర గందరగోళ పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్థన్ వారికి సర్ది చెప్పడానికి యత్నించారు. అయితే విరాళాల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని సంఘస్తులు పట్టుబడటంతో, వాటిని వెల్లడించడానికి రాజేశ్వరరావుకు గడువు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



రామకృష్ణాపురంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



శివ లింగాకృతిలో దీపాలను వెలిగించిన భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆదివారం జరిగాయి. ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక మాసంలో సామూహిక సత్యనారాయణ వ్రతాల విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అద్దంకి సత్యనారాయణప్రసాద్, ఉప్పులూరి శేషప్రసాద్‌శర్మ పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి మందిరంలో....

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ ఆదివారం జరిగింది. అయ్యప్పలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. సుమారు 400 మంది అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్తిక మాసం పూర్తయ్యే వరకు అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు తెలిపారు.


కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో సహస్ర దీపోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సహస్ర దీపోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని శివ లింగాకృతిలో దీపాలను వెలిగించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నూతక్కి వెంకట సాంబశివరావు పర్యవేక్షణలో సహస్ర దీపోత్సవం జరిగింది.

నేరప్రవృత్తి మానుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రౌడీషీటర్లు, నేరస్తులు నేరప్రవృత్తి మానుకోవాలని గుణదల సీఐ పీ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక గుణదల పోలీస్ స్టేషన్‌లో నేరస్తులు, రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుల ప్రతీ కదలికను పోలీసులు గమనిస్తుంటారని, ఏ చిన్న నేరం చేసినా పోలీసుల నుంచి తప్పించుకోలేరని చెప్పారు. నేరస్తుల తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరస్తులు ప్రవర్తన మార్చుకుని జనజీవన స్రవంతిలో కలిసిపోయి గౌరవప్రదంగా జీవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సత్యప్రసాద్, వెంకట్రావు, గుణదల పోలీసులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆస్పత్రిలో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వచ్చిన మహిళ అదృశ్యమైన ఘటనపై గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామానికి చెందిన తుమ్మ తిరుపతమ్మ తన అత్త అంజలితో కలిసి ఈ నెల 7న విజయవాడకు వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోటి కోడలిని చూసేందుకు పాత ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఇద్దరూ కలిసి ఆస్పత్రిలో ఉన్న పేషెంట్‌ను పరామర్శించి బయటకు వచ్చారు. అదే రోజు రాత్రి 9.30 గంటల సమయంలో ఆమె అత్త అంజలి ఆస్పత్రి బయట తెలిసిన వారితో మాట్లాడుతుంది. ఆ సమయంలో తిరుపతమ్మ అక్కడ నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం అంజలి వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. దీనిపై గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌ఏల నూతన కార్యవర్గం ఎన్నిక

కృష్ణలంక(విజయవాడతూర్పు): విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో వీఆర్‌ఏల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా టి.అంజి, ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, కోశాధికారి వడ్డే బాజీబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్లు షేక్ బందగీసాహెబ్, సుబ్బన్న, ఉపాధ్యక్షులు త్రినాథరావు, బ్రహ్మాజీ, పి.సుబ్బారావు, కొండబాబు, జాయింట్ సెక్రటరీలు రవికుమార్, నాగేష్, వెంకన్న, మొగిలి, నాగేంద్ర, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ దుష్ప్రచారం చేస్తూ సంఘ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.పెద్దన్న, ఎం.బాలకాశీలను సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.